క్లుప్తంగా

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



గట్టు: గట్టు తహసీల్దార్‌గా మదన్‌మోహన్‌గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న తహసీల్దార్ సలిముద్దీన్ నాగర్ కర్నూలుకు బదిలీపై వెళ్లడంతో మహబూబ్ నగర్ నుంచి జోగుళాంబ గద్వాలకు జిల్లాకు బదిలీపై వచ్చిన మదన్‌మోహన్‌గౌడ్ తహసీల్దార్‌గా బాధ్యతలు అందుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, సిబ్బంది తహసీల్దార్‌కు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.

రక్తదానం చేసి ప్రాణదాతలవ్వండి



అయిజ: రక్తదానంతో అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలు కాపాడవచ్చని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం మండలంలోని ఉత్తనూరులో దివంగత బీఆర్ఎస్ నాయకుడు తిరుమలరెడ్డి 61వ జయంతి సందర్భంగా అభిమానులు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ చైర్మన్ నటరాజ్, గద్వాల వైస్ చైర్మన్ తాహేర్, జిల్లా రెడ్ క్రాస్ ఈసీ మెంబర్ అక్బర్‌బాషా, డాక్టర్ వినీల, బీఆర్ఎస్ నాయకులు, కార్యర్తలు, టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

అమ్మవారికి బంగారు కమ్మలు వితరణ



మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి దాత మల్దకల్‌కు చెందిన నరహరి శ్రీనివాసులుశెట్టి దంపతులు బంగారు కమ్మలు వితరణ చేశారు. బుధవారం పూజలు చేసిన అనంతరం ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులకు కమ్మలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రమేషాచారి, రవిచారి, చంద్రశేఖర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరిస్తాం



గట్టు: గ్రామ అభివృద్ధికి సహకరిస్తామని మండలంలోని తుమ్మలచెరువుకు చెందిన ఎన్ఆర్ఐలు అన్నారు. మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ వినతిమేరకు వారు బుధవారం మండల పరిధిలోని ఎన్ఆర్ఐలు రాజశేఖర్‌రెడ్డి, పటేల్ అశోక్‌కుమార్‌రెడ్డి చాగదోనలో పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాల, ఆస్పత్రి, పశువైద్య శిబిరం, శిక్షణ కేంద్రాలను పరిశీలించారు. గ్రామ అభివృద్ధికి తమ వంతుగా సాయం చేస్తామని గ్రామస్తులకు హామీనిచ్చారు. ఈ సందర్భంగా పదో తరగతిలో 574 మార్కులు సాధించిన విద్యార్థి చరణ్‌ను ఎన్ఆర్ఐలు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకరన్న, ఇన్‌చార్జ్ హెచ్ఎం జావేద్ హరికృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



కేటీదొడ్డి: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలి గద్వాల డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి సంగీత లక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని నందిన్నె గ్రామంలోని మన గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తి విత్తనాలు, ఎరువులు, రికార్డులు పరిశీలించారు. నకిలీ విత్తనాలు, మందులు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ సాజిద్‌రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఆరుబయటకే..

- పల్లెల్లో మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కరువు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



చెన్నిపాడులో సామూహిక మరుగుదొడ్డి ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం

మానవపాడు: గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలన్నా.. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నా ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు తప్పనిసరి చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు, కార్యక్రమాలు నిర్వహించినా క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదు. ఎక్కడ వేసి గొంగలి అక్కడే అన్న చందంగా మారింది గ్రామాల్లో పరిస్థితి.

ఉన్నతాధికారుల ఆదేశాలతో..

గతంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అధికారులు, సిబ్బంది మండంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆరుబయటకు మల, మూత్ర విసర్జన చేయటంతో వచ్చే దుష్పరిణామాలు, అనారోగ్య సమస్యలు తెలియజేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. రేషన్, పింఛన్, కరెంట్ సరఫరా నిలిపివేస్తామని ప్రచారం చేయటంతో చాలా మంది వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ముందుకొచ్చారు.

మండల పరిధిలో..

మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 3005 వ్యక్తిగత మరుగు దొడ్లకుగానూ 3003 నిర్మించారు. గ్రామాల వారీగా మరుగుదోడ్లు.. అమరవాయి- 226, బోరవెల్లి- 278, చంద్రశేఖర్‌నగర్- 103, చందూరు- 116, చెన్నిపాడు- 316, గోకులపాడు- 94, జల్లాపురం- 431, కలుకుంట్ల- 54, కొర్విపాడు- 262, మద్దూరు- 274, మానవపాడు- 455, నారయణపురం- 104, పల్లెపాడు- 170, పెద్దఆముదాలపాడు- 120, పెద్దపోతులపాడు,



చెన్నిపాడులోని ఓ ఇంట్లో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

చిన్నపోతులపాడు గ్రామాల్లో వీఎస్‌టి పోగాకు కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించారు. ప్రతి గ్రామంలో మరుగుదొడ్లను నిర్మించినా వాటిని వినియోగించడంతో ఆయా గ్రామాల ప్రజలు విఫలమవుతున్నారు. ఇంకా ఆరుబయటకే మల,మూత్ర విసర్జనకు పాల్పడుతూ రోగాల బారిన పడుతున్నారు.

వ్యాధుల బారిన పడుతున్నారు..

బహిరంగా మలవిసర్జన ద్వారా మండల పరధిలో డయేరియా, టైఫాయిడ్ కేసులు అధిక సంఖ్యలో నమోదవుతున్నట్లు వైద్య అధికారులు పేర్కొన్నారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకంతో పాటు పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రజలు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన ఉండాలంటున్నారు.

గ్రామస్థాయి అధికారుల నిర్లక్ష్యం..

గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంలో పంచాయతీ కార్యదర్శులు విఫలమవుతున్నారు. ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ స్త్రీలు, పురుషులు రోడ్లపై, పంటపొలాల్లో మలవిసర్జనకు వెళ్తున్నట్లు కొందరు విమర్శిస్తూనే ఉన్నారు. గతంలో మానవపాడులో గతంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించిన నాగేంద్రం గ్రామాల్లో కార్యదర్శులతో సమావేశమై ప్రజలకు అవగాహన కల్పించేవారు. కానీ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న అధికారులు విధులకు వచ్చామా.. పోతున్నామా..? అన్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు పేర్కొన్నారు. కార్యదర్శులు ఎప్పుడు వచ్చి ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆరుబయట విసర్జన వలన సంక్రమించే వ్యాధులైన డయేరియా, క్లోరెల్లా, టైఫాయిడ్ వాటిపై అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించకపోవడం కలిగే దుష్పఫలితాలు, అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో గ్రామస్థాయిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బహిరంగా మల, మూత్ర విసర్జనను నిషేదం, జరిమానా విధింపు వంటి కార్యక్రమాలను పక్కన పెట్టారు. గ్రామస్థాయిలో కార్యదర్శులు పర్యటించి ప్రజలకు అవగాహన కలిౢంచాలి.

– ఆనంద్‌రెడ్డి, పల్లెపాడు

అవగాహన కల్పిస్తాం

ప్రతి కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకోవడం, వినియోగించడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మండలంలో ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొస్తాం. బహిరంగంగా మల, మూత్రవిసర్జనకు పాల్పడిన వారికి జరిమానాలు విధిస్తాం. ప్రతి గ్రామంలో కార్యదర్శులు ప్రజలకుక అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

– భాస్కర్, ఎంపీడీఓ, మానవపాడు

దేహ దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ



క్రీడాకారులతో కోచ్‌లు

గద్వాలటౌన్: తైక్వాండోతో దేహ దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి జితేందర్ అన్నారు. తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో జూనియర్, సబ్ జూనియర్ బాలుర, బాలికల చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో జిల్లా పరిధిలోని 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు, శారీరక దృఢత్వానికి కరాటే దోహదపడుతుందన్నారు. క్రీడలను స్ఫూర్తిగా తీసుకొని ఆరోగ్యకర వాతావరణంలో సానుకూల దృక్పథంతో జయాపజయాలను స్వీకరించాలన్నారు. ప్రతి క్రీడాకారుడికి క్రీడాస్ఫూర్తి ముఖ్యమని, దీని వల్లే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటామన్నారు. గద్వాలలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదని, వారిని ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తారని అభిలాషించారు. అనంతరం పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంత డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కోచ్‌లు శ్రీనివాసులుశెట్టి, రంగస్వామి, మారుతి, శ్రీనివాసులు, సుధీర్‌కుమార్, రామేశ్వరి, సాయిశరత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులను రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక చేసినట్లు కరాటే మాస్టర్ శ్రీహరి తెలిపారు. మే 31, జూన్ 1 తేదీల్లో మేడ్చల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో వారు పాల్గొనున్నట్లు తెలిపారు. ఫైటింగ్, పూంసే విభాగాల్లో క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ చాటిన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి

గద్వాల క్రైం: పొగాకుకు దూరంగా ఉండాలని జిల్లా లీగల్ న్యాయ సేవాధికార సంస్థ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజేందర్ అన్నారు. బుధవారం కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన, పొగాకు వ్యతిరేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు వలన కలిగే దుష్ప్రభావాలపై వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యాక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసులు, లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ప్రధాన రహదారి



బురదమయంగా రాజోళి- వడ్డేపల్లి ప్రధాన రహదారి

రాజోళి: మండల కేంద్రం నుంచి వడ్డేపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. రాజోళి శివారు నుంచి వడ్డేపల్లి, శాంతినగర్ వెళ్లే వరకు గుంతలమయంగా మారడంతో అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు, స్థానిక ప్రజలు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల రోడ్డుతో ప్రమాదాలకు గురైనట్లు పేర్కొన్నారు. రోడ్డు మొత్తం బురదమయం కావడంతో కనీసం నడిచేందుకు కూడా వీలు లేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. నిత్యం ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నట్లు పేర్కొన్నారు. ఏళ్ల తరబడి సమస్యను విన్నవిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన ఉండాలి



ఇటిక్యాలలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కేటీదొడ్డి: ప్రతి మహిళ తన ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచుకోవడంతో పాటు హక్కుగా భావించాలని జిల్లా స్త్రీశిశు సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి సునంద అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాతపాలెం గ్రామంలో జిల్లా మహిళాభివృద్ధి స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రుతు పరిశుభ్రత దినం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శుభ్రతపై వివరించారు. రుతుచక్రం సగటున 20 రోజులు ఉంటుందన్నారు. మహిళలకు ప్రతినెల రుతుస్రావమనేది సర్వసాధారణమని పేర్కొన్నారు. నెలసరి సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత గురించి చాలా మందికి అవగాహన లేక వ్యాధుల బారిన పడుతున్నట్లు తెలిపారు. శానిటరీప్యాడ్స్, నాప్‌కిన్స్, రక్తహీనతకు మందులు వాడేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం శానిటరీ ప్యాడ్స్‌పాడ్స్, నాప్‌కిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహ, మెడికల్ ఆఫీసర్ సామ్రిన్, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ జయన్న, సూపర్‌వైజర్ నవీన్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

ఇటిక్యాల: వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో రుతు పరిశుభ్రత దినం సందర్భంగా వైద్య సిబ్బందితో కలసి మహిళలు, కిశోర బాలికలకు నెలసరి సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత గురించి అవగాహన కలిౢంచారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంలు ఎలిజబెత్, విశ్వనాథమ్మ, అశా వర్కర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 2005- 06 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా మృతి చెందిన పూర్వ విద్యార్థులు చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, మద్దిలేటి, నరేష్, దేందర్‌నాయుడు, ఈశర్మరమ్మ, నాజిమ్మబేగంకు నివాళ్లర్పించారు. అనంతరం రూ.40వేలు పాఠశాలకు విరాళం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అలనాటి ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు!

- 40 లారీల వరకు కర్నూలు జిల్లా నుంచి జొన్న ధాన్యం తరలింపు
- ఒక్కో లారీ నుంచి సుమారు రూ.3 లక్షల వరకు స్వాహా
- రూ.కోటి ప్రభుత్వ సొమ్ము కాజేసేందుకు పన్నాగం



రాజోళిలో జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు, అలంపూర్ మార్కెట్‌యార్డ్ ప్రతినిధులు (ఫైల్)

శాంతినగర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాల్లో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. పక్క రాష్ట్రం కర్నూలు నుంచి జొన్న ధాన్యం తెప్పించి ఏకంగా రూ.కోటి వరకు స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వడ్డేపల్లి పీఏసీఎస్ పరిధిలోని కొంకల, పచ్చర్ల, రాజోళిలో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సీడు జొన్న వేసిన రైతులు పండించిన ధాన్యాన్ని మార్కెట్‌లో క్వింటాల్ రూ.2,200 నుంచి రూ.2,300 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్ ధర రూ.3,370 ఉండటంతో అక్రమార్కుల కళ్లు జొన్నలపై పడ్డాయి.

నిర్వాహకులతో కుమ్మక్కు..

క్వింటాల్‌కు రూ.వెయ్యి వరకు తేడా ఉండటంతో ఆయా కొనుగోలు కేంద్రాలకు చెందిన నిర్వాహకులతో అక్రమార్కులు చేతులు కలిపారు. కర్నూల్ జిల్లాలో పండించిన జొన్న ధాన్యాన్ని తెలంగాణ రైతుల పేరుతో నేరుగా లారీల ద్వారా గోదాంలకు తరలించారని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 40 లారీల వరకు కర్నూల్‌కు చెందిన జొన్న ధాన్యాన్ని గోదాంలకు తరలించి రూ.కోటి వరకు ప్రభుత్వ సొమ్ము కాజేశారని రైతులు చెబుతున్నారు. తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని మాత్రం వివిధ కారణాలు, సాకులు చెబుతూ కొనుగోళ్లలో ఆలస్యం చేస్తున్నారని ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఈవిషయమై పీఏసీఎస్, మార్కెటింగ్‌శాఖ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా కొందరు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంపాటు మరికొందరు సరైన సమాధానం చెప్పకుండా ఒకరిపై మరొకరు చెబుతూ దాటవేస్తున్నారు. ఈవిషయమై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు స్పందించి ఆయా కొనుగోలు కేంద్రాలను, జొన్న ధాన్యం నిల్వ చేసిన గోదాంలను వెంటనే తనిఖీ చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కథనానికి కదిలిన యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..



డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు, అధికారులు

అయిజ: ఈనెల 25న ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'అధ్వానంగా అంతరాష్ట్ర రహదారి' కథనానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కదలివచ్చారు. బుధవారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఆర్అండ్‌బీ డీఈ సుభాష్, ఏఈ అల్తాఫ్, కాంట్రాక్టర్ నాగయ్య నాయుడు అంతరాష్ట్ర రహదారి (కర్నూలు- రాయచూర్) రోడ్డుపై మండలంలోని ఉప్పల క్యాంప్ శివారులో శిథిలమైన కల్వర్టును పరిశీలించారు. కొత్త కల్వర్టు నిర్మించేందుకు డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ ఏఈ మాట్లాడారు. శిథిలమై 6 కి.మీ రోడ్డుకు మరమ్మతులు చేయడంతోపాటు కల్వర్టులు నిర్మించి వాటికి అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. దాని కోసం రూ.3.50 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు 'సాక్షి'ని అభినంధించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాగులో ముళ్లపొదల తొలగింపు



ముళ్ల పొదలు తొలగింపజేస్తున్న మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని చిన్నవాగులో బుధవారం మున్సిపల్ అధికారులు ముళ్ల పొదలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు సిబ్బందితో వాగులో మూడు కి.మీ. దూరం వరకు దట్టంగా వ్యాపించిన ముళ్లపొదలు తొలగించారు. బింగుదొడ్డి చెరువు నుంచి ప్రారంభమయ్యే వాగు సుమారు 5 కి.మీ. దూరం ఉంటుందని, ముళ్ల పొదలను తొలగించకుంటే వరద ప్రవాహం పట్టణంలోని వివిధ కాలనీలను ముంచెత్తుతుందని పట్టణవాసులు వాపోవడంతో తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు.

నిజాం పాలనను ఎండగట్టిన ధైర్యశాలి సురవరం



జూలెకల్‌లో సురవరం, సావర్కర్ జయంతి వేడుకలో గ్రామస్తులు



ఇటిక్యాలపాడులో నిర్వహిస్తున్న సురవరం జయంతి వేడుకలు

శాంతినగర్: నిజాం పాలనలో గోల్కొండ పత్రికను స్థాపించి నిజాం దుర్మాగ్గపు పాలనను ఎండగట్టిన ధైర్యశాలి సురవరం ప్రతాపరెడ్డని పలువురు నాయకులు అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి, వీర సావర్కర్ జయంతి వేడుకలు వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన యువకులు ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇరువురి చిత్రపటాలకు నివాళులర్పించారు. బ్రిటీష్ అధికారాన్ని ధిక్కరించిన విప్లవ వీరుడు, ఎందరో విప్లవకారులు, స్వాతంత్ర్య సమరయోధులకు స్ఫూర్తినిచ్చిన వీరపుత్రుడు సావర్కర్ అంటూ కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సురవరానికి ఘన నివాళి

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడులో మాజీ ఎమ్మెల్యే సురవరం ప్రతాప్‌రెడ్డి 129 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు సురవరం లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, నిరక్ష్యరాశుల అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో రైతులు, యువత పాల్గొన్నారు.

క్యాట్‌ఫిష్ సాగుపై చర్య తీసుకోవాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రవల్లి: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా చెరువులను ఏర్పాటు చేసుకొని నిషేధిత క్యాట్‌ఫిష్‌లను పెంచుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ బుధవారం కలెక్టర్ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని తిమ్మాపురం, శేకుపల్లి, సాసనూలు, గార్లపాడు, జింకలపల్లి, కొండేరు తదితర గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా ఓ పార్టీకి చెందిన నాయకుల అండదండలతో చేపల చెరువులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చేపలకు మేతగా కుళ్లిన కోడిగుడ్లు, కోళ్ల వ్యర్థాలతో ప్రభుత్వ నిషేధిత క్యాట్ ఫిషలు సాగుచేస్తున్నారని తెలిపారు. అక్రమంగా చెరువులు ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



ఇటిక్యాలలో మొక్కలు నాటుతున్న వైద్య సిబ్బంది

ఇటిక్యాల: నాటిన ప్రతి మొక్కను ఏపుగా పెరిగే వరకు సంరక్షించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక అన్నారు. బుధవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో హరిత యోగా ట్రీ ప్లాంటేషన్‌లో భాగంగా సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భావితరాలు పొల్యూషన్ బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని తమ ఇంటి పరిసరాలు, కాలనీలు, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ముబీనా తబ్సుమ్, వైద్య సిబ్బంది శివాని, నరేష్, శరీఫ్, అశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో బోధించాలి



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉండవెల్లి: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభ పద్ధతిలో బోధన చేయాలని ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు భాగంగా బుధవారం రెండో రోజు అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి స్కూల్‌లో నిర్వహించారు. విద్యార్థులతో మెలగాల్సిన తీరు, బోధన, క్రమశిక్షణా విధానాలు తదిదర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ వెంకటేష్ తదిదరులు పాల్గొన్నారు.